## గరగపర్రు దళితులపై సాంఘిక బహిష్కరణను విధించిన

## ఆధిపత్య కుల పెత్తందారులను కఠినంగా శిక్షించాలి

---

**పశ్చిమగోదావరి** జిల్లా-పాలకోడేరు మండలం గరగపర్రు గ్రామంలో ఆధిపత్య క్షత్రియ కుల పెత్తందార్లు ఆ గ్రామదళితులను రెండు నెలలుగా సాంఘిక బహిష్కరణకు గురిచేయటాన్ని రైతుకూలీసంఘం(ఆం.ప్ర) తీవ్రంగా ఖండిస్తోంది.

గరగపర్రులో దళిత యువకులు ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి సందర్భంగా అంబేద్కర్ విగ్రహ ప్రతిష్టాపనకు పూనుకోవటాన్ని గ్రామ పెత్తందార్లు జీర్ణించుకోలేకపోయారు. ఏప్రిల్ 23న పంచాయితీ ఆఫీసు ఎదురుగా చెరువుగట్టుపై ప్రతిష్టించిన అంబేద్కర్ విగ్రహాన్ని గ్రామ పెత్తందార్లు తొలగించినా, తిరిగి దళితులు దానిని నెలకొల్పుకున్నారు. దీనిపై ఆగ్రహించిన గ్రామంలోని పెత్తందారుల నాయకత్వంలో 14 కులాలవారు గ్రామంలోని 800 కుటుంబాలకు చెందిన 1400 మందిని సాంఘికంగా బహిష్కరిస్తూ నిర్ణయించారు. గ్రామస్థులెవరూ దళితులతో మాట్లాడకూడదు; డబ్బు, ఆహారంతోసహా వారి అవసరాలకెవరూ తోడ్పడకూడదు; గ్రామంలో వ్యవసాయం, చేపలచెరువులలో వారికెవరూ పని కల్పించరాదనే ఆంక్షలతో దళితులు అవమానాకి తోడు తీవ్ర ఇబ్బందులనెదుర్కొన్నారు. ఈ నిబంధనలను అతిక్రమించిన గ్రామస్థులపై 10వేల రూ॥ జరిమానా విధించాలని నిర్ణయించారు. దళితుల వద్దకు రాకపోకలను తెలుసుకొనేందుకు నిఘా కెమేరాలను సైతం వినియోగించారు. పరిసర గ్రామస్థులు కూడా పనులు కల్పించకుండా గరగపర్రు పెత్తందార్లు వారిని నియంత్రించారు. దీనికితోడు దళితులు కౌలుకుచేస్తున్న తమ పొలాలను తిరిగి కౌలుకు ఇవ్వబోమని పెత్తందార్లు తేల్చి చెప్పారు.

జిల్లా అధికార యంత్రాంగానికి దళితులు విన్నవించుకున్నా వారిలో కదలిక లేదు. బాగా అభివృద్ధిచెందిందని చెప్పబడుతున్న పశ్చిమగోదావరి జిల్లాలో సాగుతున్న మధ్యయుగాల నాటి ఈ అమానుషాన్ని బయటి ప్రపంచానికి తెలియకుండా ప్రచార సాధనాలను పెత్తందార్లు అదుపుచేయగలిగారు.

దాదాపు రెండు నెలలుగా సాగుతున్న ఈ దుర్మార్గం, ఇటీవల వెల్లడై దళిత ప్రజాసంఘాలు, వామపక్షాలు ఆందోళనకు పూనుకోవటంతో ప్రభుత్వం కళ్ళు తెరచి కంటితుడుపు చర్యలకు పూనుకొంది.

దళితులపై గరగపర్రు ఆధిపత్యకుల పెత్తందార్లు సాగించిన ఈ అమానుషాన్ని ఖండిస్తూ, దీనికి బాధ్యులైన గ్రామపెత్తందార్లను కఠినంగా శిక్షించాలని, గరగపర్రు గ్రామంలో దళితుల భూమి సమస్యను పరిష్కరించాలని, పేదలు, దళితులందరికీ భూమిపై హక్కు కల్పించాలని రైతుకూలీసంఘం(ఆం.ప్ర) డిమాండ్ చేస్తున్నది. గ్రామ దళితులు సాగిస్తున్న ఆందోళనకు సంఘీభావాన్నందిస్తున్నది.

**విజయవాడ**
**5-7-17**

**యస్.ఝాన్సి**
**అధ్యక్షులు**
**రైతుకూలీసంఘం(ఆం.ప్ర)**

ooooo